క్లుప్తంగా

గ్రామాల అభివృద్ధికి కృషి



వాటర్ ట్యాంకును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

బెజ్జంకి(సిద్దిపేట): గ్రామాలలో మౌలిక వసతులు కల్పించడానికే రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పలువురు లబ్ధిదారులకు మంజూరైన రూ.13.52 లక్షల విలువైన సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ముత్తన్నపేటలో రూ.18 లక్షలతో నిర్మించిన మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలకు వైద్య సదుపాయం కల్పించేందుకు సీఎం సహాయనిధి వరంలా మారిందన్నారు. ఆయా కార్యక్రమాలలో నాయకులు దామోదర్, పులి కృష్ణ, జెల్ల ప్రభాకర్, రాజశేఖర్‌రెడ్డి, రత్నాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నర్సయ్య, శ్రీనివాస్‌గౌడ్, పోచయ్య, సంతోష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆకుపచ్చ సిద్దిపేటనే లక్ష్యం



మొక్కలు పంపిణీ చేస్తున్న చైర్మన్ మంజుల, వైస్ చైర్మన్ కనకరాజు, కమిషనర్ ఆశ్రిత్

సిద్దిపేటజోన్: ప్రజల సహకారంతో గ్రీన్ సిద్దిపేటనే లక్ష్యంగా ముందుకు సాగాలని మున్సిపల్ చైర్మన్ మంజుల సూచించారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు, కమిషనర్ ఆశ్రిత్ కుమార్‌తో కలిసి పట్టణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా 31, 32వ వార్డుల్లో ప్రజలకు మొక్కలు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ నాటిన మొక్కలను పరిరక్షించాలన్నారు. అనంతరం గాంధీ చౌక్ వ్యాపారులతో కలిసి మొక్కలు నాటారు. అన్ని వార్డుల్లో మొక్కలు పంపిణీ చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్స్, మున్సిపల్ డీఈ ప్రేరణ, కౌన్సిలర్లు సాయి ఈశ్వర్‌గౌడ్, మోహిజ్, రాజు పాల్గొన్నారు.

విజయం కోసం పని చేయాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుస్నాబాద్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయం దిశగా పని చేయాలని మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఎల్కతుర్తి మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ గ్రామాన గులాబీ జెండా ఎగురవేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలం చెందిందని చెప్పారు. రైతులకు సాగునీరు అందించి వారి కుటుంబాల్లో కేసీఆర్ సంతోషాన్ని నింపారని గుర్తుచేశారు. మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సాయన్న సేవలు మరువలేనివి: బీఆర్ఎస్ నేత



నివాళులర్పిస్తున్న ముదిరాజ్ నేతలు

చిన్నకోడూరు(సిద్దిపేట): సమాజ హితం కోసం పాటుపడిన పండుగ సాయన్నను యువత ఆదర్శంగా తీసుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని చంద్లాపూర్‌లో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పండుగ సాయన్న జయంతి వేడుకలు శుక్రవారం నిర్వహించారు. అనంతరం సాయన్న విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజుల అభ్యున్నతికి పాటుపడిన గొప్పవ్యక్తి సాయన్న అన్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు.



దుబ్బాక: అనంతమహాలక్ష్మీ ఆలయంలో వ్రతాలాచరిస్తున్న మహిళలు



సిద్దిపేటఅర్బన్: నాంచారుపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో...

వరలక్ష్మీ వ్రతం.. ఇంటింటా సౌభాగ్యం



జగదేవ్‌పూర్(గజ్వేల్): ప్రత్యేక అలంకరణలో వరలక్ష్మీదేవి

శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. ఇళ్ల వద్ద మహిళలు వరలక్ష్మి వ్రతాలను భక్తి శ్రద్ధలతో ఆచరించారు. ఉదయమే ఇళ్లను శుభ్రం చేసుకుని, పూలతో వరలక్ష్మీ దేవిని ప్రత్యేకంగా అలంకరించారు. గణపతి పూజ, కలశ పూజ, కంకణ పూజలు నిర్వహించారు. మహిళలు ఒకరినొకరు వాయినాలను ఇచ్చి పుచ్చుకున్నారు. ఐదు రకాలుగా పిండివంటలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఏడాదంతా శుభాలు కలగాలని మొక్కులు చెల్లించుకొన్నారు.



సిద్దిపేటలో వరలక్ష్మీదేవికి పూజలు చేస్తున్న మహిళలు

పారిశుద్ధ్య నిర్వహణ లోపించొద్దు

అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్



ఉపాధ్యాయుల హాజరు రిజిస్టరు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్

కొండపాక(గజ్వేల్): వసతి గృహాల్లో పారిశుద్ధ్య నిర్వహణ లోపించకుండా చూసుకోవాలని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ హెచ్చరించారు. మండలంలోని దుద్దెడలోని సాంఘిక సంక్షేమ బీసీ గురుకుల బాలుర పాఠశాల, కళాశాలను శుక్రవారం సాయంత్రం సందర్శించారు. రాత్రిపూట విద్యార్థులకు అందే భోజనం, కూరగాయలు, నిత్యావసర సరుకులను పరిశీలించారు. రోజూ మెనూ ప్రకారం భోజనం అందుతుందా? లేదా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల హాజరు రిజిస్టరు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హాస్టల్లో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేకపోతే విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడే అవకాశాలుంటాయన్నారు. కామన్ డైట్ మెనూ పాటించడంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వర్షాకాలం కావడంతో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. మెరుగైన బోధన అందించి ఉత్తమ ఫలితాలు వచ్చేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కారదర్శి చక్రపాణి, ప్రిన్సిపాల్స్, హాస్టల్ వార్డెన్స్ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా ప్రక్షాళన పేరుతో మోసం

సీపీఎం నేత రవీందర్



కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

కొమురవెల్లి(సిద్దిపేట): బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రక్షాళన పేరుతో కేంద్ర ప్రభుత్వం మరోసారి ప్రజలను మోసం చేస్తోందని సీపీఎం మండల కార్యదర్శి తాడూరి రవీందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం కార్యకర్తలు, నాయకులతో కలసి బిహార్‌లో మైనార్టీలు, ప్రతిపక్షాల ఓట్లు తొలగించినందుకు నిరసనగా కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిహార్‌లో జరగనున్న ఎన్నికలలో సుమారు 65 లక్షల మంది ఓటర్లను జాబితా నుంచి కుట్రపూరితంగా తొలగించారని ఆరోపించారు. ప్రధానంగా ఎస్సీలు అధికంగా ఉన్న నియోజకవర్గాలలో ఎక్కువ ఓట్లు తొలగించారని, అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం ఇచ్చిన కొద్దిపాటి ప్రయోజనాలకు కూడా పొందకుండా బీజేపీ చూస్తుందని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు బాలకిషన్, సాయిలు, ఎల్లయ్య, రవీందర్, నరేశ్, శ్రీనివాస్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలకు మించిన ఔషధం లేదు



వారోత్సవాల్లో పాల్గొన్న గర్భిణులు, బాలింతలతో సీడీపీఓ సూపర్‌వైజర్ శారద, అంగన్‌వాడీ టీచర్లు

ఐసీడీఎస్ సీడీపీఓ శారద

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): శిశువు జన్మించగానే తల్లి పాలు తాగించాలని, తల్లిపాలకు మించిన దివ్యమైన ఔషధం మరొకటి లేదని సీడీపీఓ శారద అన్నారు. తల్లిపాల వారోత్సవాలను జిల్లా కేంద్రంలోని స్థానిక శరభేశ్వర ఆలయ ఆవరణలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు పండ్లు, కొత్త దుస్తులు, పూలు, పౌష్టికాహారం అందించారు. ఈ సందర్భంగా శారద మాట్లాడుతూ ప్రతి బిడ్డకు తల్లిపాలు చాలా కీలకమన్నారు. శిశువు దశలో తల్లి ఇచ్చే పాలు వారిలో రోగనిరోధకశక్తి పెంచుతుందని, పిల్లలు ఆరోగ్యంగా ఎదగడంలో ఉపయోగపడతాయని చెప్పారు. బాలింతలు, గర్భిణులు నాణ్యమైన, బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. తల్లులు ఆరోగ్యంగా, మానసికంగా బలంగా ఉంటే పుట్టబోయే బిడ్డ కూడా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, టీచర్‌లు పద్మ, రమాదేవి, రత్నమాల, పుష్ప, వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ ఆయాలు పాల్గొన్నారు.

నానో యూరియాతో పర్యావరణానికి మేలు

ఏఓ శ్రీనాథ్

సిద్దిపేటఅర్బన్: ద్రవరూప నానో యూరియా వాడకంతో పర్యావరణానికి మేలు జరుగుతుందని అర్బన్ మండల ఏఓ బి.శ్రీనాథ్ అన్నారు. మండలంలోని మిట్టపల్లిలో డ్రోన్ సాయంతో నానో యూరియా, డీఏపీ పిచికారీపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంప్రదాయ యూరియాతో పోల్చిస్తే నానో యూరియా వాడడం వల్ల 8 నుంచి 10 శాతం దిగుబడి పెరుగుతుందని, 70–80 శాతం వినియోగ సామర్థ్యం కలిగి ఉంటుందన్నారు. నానో యూరియాలో నత్రజని కణాలు చాలా చిన్న పరిమాణంలో ఉండడం వల్ల మొక్కలు త్వరగా వినియోగించుకుంటాయని చెప్పారు. నానో యూరియా తక్కువ ధరలో అందుబాటులో ఉండడం వల్ల రైతులకు ఖర్చు కూడా తగ్గుతుందని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ పవన్, రైతులు పాల్గొన్నారు.



డ్రోన్ సహాయంతో నానో యూరియా పిచికారీపై అవగాహన కల్పిస్తున్న ఏఓ శ్రీనాథ్

బ్రహ్మాండనాయకుడి బ్రహ్మోత్సవాలు ముగింపు



సామూహిక వరలక్ష్మీ వ్రతాలాచరిస్తున్న మహిళలు



కల్యాణ వెంకటేశ్వరుడు

దుబ్బాక: దుబ్బాక బాలాజీ ఆలయంలో ఆరు రోజులుగా బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. 3న ప్రారంభమైన ఈ ఉత్సవాలు శుక్రవారం స్వామివారికి చక్రస్నానంతో ముగిశాయి. చివరి రోజున సామూహిక కుంకుమార్చన, వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. స్వామి వారికి చక్రస్నానంతోపాటు భక్తులకు వేద ఆశీర్వచనం కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గం ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డితోపాటు భక్తులు అధిక సంఖ్యలో ప్రత్యేక పూజలు చేశారు. పోలీసులు,మున్సిపల్ సిబ్బందికి ఆలయ చైర్మన్ వడ్లకొండ శ్రీధర్, బాధ్యులు చింత రాజు, రాజమౌళి కృతజ్ఞతలు తెలిపారు.

రక్తహీనత నుంచి కాపాడండి

తొగుట(దుబ్బాక): నులిపురుగు నివారణ మాత్రలు వేసి పిల్లలను రక్తహీనత నుంచి కాపాడాలని మండల వైద్యాధికారి రాధాకృష్ణ పిలుపునిచ్చారు. జాతీయ నులిపురుగు నివారణ కార్యక్రమంలో భాగంగా రైతువేదికలో ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలకు 11న నిర్వహించే నులిపురుగు నివారణ మాత్రల పంపిణీపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీసబ్ సెంటర్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలో మాత్రలు అందుబాటులో ఉంచుతామని చెప్పారు.

దళితుల ప్రోత్సాహంతో రాణించా..

- కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారు
- డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి



దళితులతో కలిసి భోజనం చేస్తున్న నర్సారెడ్డి

గజ్వేల్: దళితుల ప్రోత్సాహంతోనే తాను రాజకీయాల్లో రాణించానని, కానీ కొందరు తనను దళిత వ్యతిరేకిగా దుష్ప్రచారం చేస్తున్నారని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి వాపోయారు. మున్సిపాలిటీ పరిధిలోని కాంగ్రెస్ దళిత నాయకుడు శివులు ఇంట్లో శుక్రవారం సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్గల్ సర్పంచ్‌గా తన రాజకీయ జీవితం ప్రారంభం కాగా తనకు దళితులే వెన్నంటే నిలిచారన్నారు. హైదరాబాద్‌లో విద్యాభ్యాసం తర్వాత స్వగ్రామం వర్గల్‌కు రాగానే సర్పంచ్‌గా పోటీ చేయాలని దళితులే ప్రోత్సహించారని చెప్పారు. దళితుల సహకారాన్ని తానూ ఎన్నటికీ మరిచిపోలేనని చెప్పారు. కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆంక్షారెడ్డి, మాజీ ఎంపీపీ మోహన్, కాంగ్రెస్ పట్టణశాఖ అధ్యక్షుడు రాజు, నాయకులు రాములు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి



జిరాక్స్ మిషన్ అందజేస్తున్న దాత రమేశ్

మిరుదొడ్డి(దుబ్బాక): అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఎంఈఓ ప్రవీణ్‌బాబు సూచించారు. మండల పరిధిలోని కాసులాబాద్ ప్రాథమిక పాఠశాల అవసరాలకుగాను శుక్రవారం సిద్దిపేటకు చెందిన చొల్లేటి రమేశ్ కుటుంబ సభ్యులు జిరాక్స్ మిషన్‌ను అందజేశారు. స్టడీ అవర్స్‌లో విద్యార్థులకు స్నాక్స్ అందించడానికి గ్రామానికి చెందిన గోవిందారం రాజయ్య, తుమ్మల రవీందర్, నర్సింహులు ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు బాల్‌రాజు, హెచ్‌ఎంలు విఠల్, వెంకటరాజ లింగం, రామచంద్రారెడ్డి, ఉపాధ్యాయులు సురేశ్, రామచంద్రం, శివకుమార్, విద్యా ప్రకాశ్, వినోద, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

దళిత మంత్రులపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాకటౌన్: రాష్ట్రంలో దళిత మంత్రులు దామోదర రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామిపై దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, తక్షణమే క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ క్యాంపు కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పదేళ్లపాటు మెదక్ ఎంపీగా ఉండి, నిధులు సిద్దిపేట, గజ్వేల్‌కి తరలిపోతుంటే ఉత్సవ విగ్రహంలా చూస్తూ ఉండిపోయారన్నారు. సత్యం రామలింగరాజు ఆస్తులను అక్రమంగా అమ్ముకుని కోట్లకు పడగలెత్తారని, కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ పదవిలో ఉన్న బక్కి వెంకటయ్య, దుబ్బాక ఎమ్మెల్యేతో కలిసి తిరుగుతూ అధికారులను బెదిరిస్తూ పబ్బం గడుపుకుంటున్నారని మండిపడ్డారు. మరోసారి మంత్రులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే రాష్ట్ర పొలిమేర వరకు తరుముతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొంగరి రవి, శ్రీనివాస్, నరేశ్, మల్లేశ్ యాదవ్, వెంకటస్వామి గౌడ్, కమలాకర్ తదితరులున్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

డీఎంహెచ్‌ఓ ధనరాజ్

హుస్నాబాద్‌రూరల్: గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ ధనరాజ్ ఆదేశించారు. మీర్జాపూర్, అక్కన్నపేట, రామవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను శుక్రవారం తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. మందుల నిల్వలను ఎప్పటికప్పుడు పరిశీలించి తెప్పించాలని, గ్రామాల్లో దోమల నివారణ, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.



మందులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ ధనరాజ్

అనుబంధానికి ప్రతీక రాఖీ

అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్ల ఆత్మీయతానుబంధానికి ప్రతీక రాఖీ పండుగ. ఈ సందర్భంగా ఆడపడుచులు మమతానురాగాల మధ్య తమ సోదరులకు రాఖీలు కట్టి ఆశీర్వచనాలను తీసుకోవడం ఆనవాయితీ. శనివారం రాఖీ పౌర్ణమి సందర్భంగా సంబురాల సందడి మొదలైంది.

నేడు రక్షాబంధన్ వేడుకలు ● దుకాణాల వద్ద మహిళల సందడి



గజ్వేల్‌లో సందడిగా రాఖీ విక్రయాలు

గజ్వేల్‌రూరల్: గజ్వేల్‌లో దుకాణాలు రాఖీల విక్రయాలతో సందడిగా మారాయి. రూ.5 నుంచి రూ. 300.. ఆపైన ధర పలికే వివిధ రకాల డిజైన్లతో కూడిన రాఖీలు అందుబాటులో ఉన్నాయి. బస్టాండ్ సమీపంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ముందు భాగం, ఇందిరాపార్కు చౌరస్తా నుంచి హనుమాన్ టెంపుల్ వెళ్ళే మార్గం, వర్గల్ కమాన్ నుంచి సంగాపూర్ వెళ్లే మార్గం, ప్రజ్ఞాపూర్ వెళ్లే మార్గంలో సుమారు 30కి పైగా దుకాణాలు వెలిశాయి. మహిళలు తమ సోదరులకు కట్టేందుకు రాఖీలను కొనుగోలు చేయడానికి దుకాణాల వద్ద క్యూ కట్టారు.



వివిధ రకాల డిజైన్లలో రక్షాబంధన్‌లు

రాఖీ పౌర్ణమి విశిష్టత

హిందు సాంప్రదాయం ప్రకారం శ్రావణమాసంలో రాఖీ పౌర్ణమి జరుపుకుంటారు. ఉత్తర భారతదేశంలో రాఖీ పౌర్ణమిని రక్షాబంధన్‌గా పేర్కొంటారు. సోదరి తన సోదరుడికి విజయం చేకూరాలని రాఖీ కడుతుంది. రాఖీ కట్టిన సోదరికి జీవితాంతం రక్షగా ఉంటానని సోదరుడు భావించే పండుగ ఇది.

విజయం ప్రాప్తించాలని..



రక్షాబంధన్ లేక రాఖీ పండుగగా ప్రాచుర్యం పొందిన శ్రావణపూర్ణిమ నాడు 'యేన బద్ధో బలీరాజా దానవేంద్రో మహాబలః తేన త్వామభి బధ్నామి రక్షమాచల మాచల' మంత్రాన్ని పఠిస్తూ సోదరి–సోదరునకు, భార్య–భర్తకు ఈ రక్షా బంధన కడుతుంటారు. పూర్వం యుద్ధానికి వెళ్లే వీరుడికి విజయం ప్రాప్తించాలని ఆశిస్తూ ఈ రక్షాబంధనను కట్టే వారని పురాణాలు చెబుతున్నాయి. తోబుట్టువుల ఆత్మీయతానురాగాలకు ప్రతీకగా ఈ పండుగ నిలుస్తుంది.

– చాద నందబాలశర్మ, మహంకాళీ ఆలయ ప్రధాన పూజారి

ఎకో ఫ్రెండ్లీ రాఖీలు



ఎకో ఫ్రెండ్లీ రాఖీలతో పంచాయతీ అధికారులు, సిబ్బంది

దుబ్బాకటౌన్: తమ సోదరుల రక్షణ కోరే అక్కాచెల్లెళ్లు భూతల్లి రక్షణ సైతం కోరాలని రాయపోల్ పంచాయతీ కార్యదర్శి శివకుమార్ అన్నారు. రాఖీ పండుగ సందర్భంగా శుక్రవారం డీపీఓ దేవకీదేవి ఆదేశాల మేరకు రాయపోల్ పంచాయతీ కార్యాలయంలో ఎకో ఫ్రెండ్లీ రాఖీలను తయారు చేసి పంచాయతీ సిబ్బందితో కలిసి ముందస్తుగా రాఖీ పౌర్ణమి నిర్వహించారు. పువ్వులు, కాగితాలు, పప్పు దినుసులతో రాఖీలను తయారు చేశామని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే దుబ్బాక పోలీస్ సర్కిల్ కార్యాలయం, పోలీస్ స్టేషన్లో మహిళా పోలీస్ సిబ్బంది సీఐ శ్రీనివాస్, ఎస్ఐ కీర్తిరాజు ఇతర సిబ్బందికి రాఖీలు కట్టి అనుబంధాన్ని తెలియజేశారు.



దుబ్బాక సీఐ శ్రీనివాస్, ఎస్ఐ కీర్తిరాజ్‌కు రాఖీ కడుతున్న మహిళా పోలీసు సిబ్బంది